క్లుప్తంగా

లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

ఏలూరు టౌన్: ఏలూరు పత్తేబాదలోని రెడ్ క్రాస్ ఏఎన్ఎం నర్సింగ్ కళాశాలలో ప్రారంభమైన 27వ బ్యాచ్‌ను జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అభినందించారు. నర్సింగ్ కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదవి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అమెరికా నుంచి వచ్చిన గుర్రాల బాల చిన్నపురెడ్డి, భవ్యరెడ్డి విద్యార్థినులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసిన అనంతరం బీఎస్సీ నర్సింగ్ చదవాలనే విద్యార్థినులకు పూర్తి ఖర్చులు భరిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ స్టాఫ్ జి.ఝానవేణి, సీహెచ్ అనూష, ఎ.సూర్యనారాయణ, వి.నాగరాజు, ఎండీ సుధీర్ ఉన్నారు.

ఆడుదాం.. ఆంధ్రాకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

పెదవేగి : ఆడుదాం.. ఆంధ్రా క్రీడోత్సవాల్లో పాల్గొనే ఔత్సాహికులు తమ పేర్లను ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పెదవేగి ఎంపీడీవో జి.ఆర్. మనోజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలకు సోమవరం నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభమైయిందన్నారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 13వ తేదీవరకు రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాండ్మింటన్, క్రీడా పోటీల్లో 15 ఏళ్లు నిండిన మహిళలు, పురుషులు అందరూ అర్హులని తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే ఔత్సాహికులు డిసెంబర్ 27వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో లేదా, 1902 నంబర్‌కు కాల్ చేసి లేదా తమ సమీప గ్రామ, వార్డు సచివాలయం, వలంటీర్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ పోటీలను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 3న విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయన్నారు. డిసెంబరు 15 నుంచి 22 వరకు గ్రామస్థాయిలో ఆడుదాం.. ఆంధ్రా క్రీడోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

3 నుంచి ఆగ్రో టెక్ సదస్సు

దెందులూరు: ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో గుంటూరు లాంగ్ పార్క్‌లో ఆగ్రో టెక్ సదస్సు నిర్వహిస్తున్నామని ఏరువాక సమన్వయకర్త (ఏలూరు) డాక్టర్ టీ సుజాత అన్నారు. మంగళవారం దెందులూరులో ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ నూతన వ్యవసాయ సాంకేతిక అంశాలు, పలు పంటలకు సంబంధించి నూతన వంగడాలు, సాగు పద్ధతులు, సస్యరక్షణ, మార్కెటింగ్, ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, పాడి జాతి పెంపకంపై అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, యువత, డీలర్లు పెద్ద సంఖ్యలో ఆగ్రో టెక్ సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని డాక్టర్ సుజాత కోరారు.

పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా పీటర్ పాల్

దెందులూరు: దెందులూరు మండల ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా డీ.పీటర్ పాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫెడరేషన్ కమిటీ జాయింట్ సెక్రటరీ జీవన్ కుమార్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఏలూరు జిల్లా ప్రెసిడెంట్ రత్నప్రసాద్, చిత్రాల జోసెఫ్, డీ.రాజారత్నం ఉన్నారు.

30న గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్

దెందులూరు: గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న దెందులూరు స్కూల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహించనున్నట్లు దెందులూరు నియోజకవర్గం స్పోర్ట్స్ కాంప్లెక్స్ చైర్మన్ డాక్టర్ మరీదు మనోహర్, దెందులూరు మండల చైర్మన్ జక్కుల సురేష్ తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఉదయం 8.30 గంటలకు పెన్ను, నోటు పుస్తకం, పీఈటీ డ్రెస్ కోడ్‌తో స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్‌కు హాజరు కావాలని మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రవి సూచించారు.

జ్యోతిబా పూలే జీవితం ఆదర్శనీయం

ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్యవేణి



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్యవేణి



జెడ్పీ కార్యాలయంలో జ్యోతిబా పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ



పూలేకు నివాళులర్పిస్తున్న ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు



సదస్సులో మాట్లాడుతున్న జాతీయ బీసీ నాయకుడు పాకా సత్యనారాయణ

ఏలూరు(మెట్రో): సమాన హక్కులు, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధి కోసం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మహాత్మా జ్యోతిబాపూలే గొప్ప దార్శనికుడని ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే 133వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి లావణ్యవేణి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి ఆర్‌వీ నాగరాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు, ఏపీఐఐసీ జెడ్ఎం బాబ్జి, సెట్‌వెల్ సీఈఓ ఎండీ మెహరాజ్, కలెక్టర్ పరిపాలనాధికారి రమాదేవి, రజక సంఘం నాయకులు సీహెచ్ కట్లయ్య, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్‌ల్ చల్లన్న దొర, షా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా లావణ్యవేణి మాట్లాడుతూ సామాన్య జీవితంతో మహోన్నత స్థాయికి మహాత్మా జ్యోతిబాపూలే ఎదిగి అందరికీ ఆదర్శప్రాయుడయ్యారని తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో మహాత్మా జ్యోతి రావ్ పూలే చిత్రపటానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీ కోటగిరి శ్రీధర్, మేయర్ నూర్జహాన్ పెదబాబు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏలూరు నగర డిప్యూటీ మేయర్‌లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మహాత్మా పూలే ఆశయాలు సాధిద్దాం

ఏలూరు (టూటౌన్): పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రముఖ సామాజిక వేత్త, విద్యావేత్త మహాత్మా జ్యోతిబా పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. మహాత్మా పూలే 134వ వర్ధంతి సందర్భంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఆయనకు ఘన నివాళులర్పించారు. స్థానిక జిల్లా పరిషత్ సెంటర్‌లోని పూలే దంపతుల విగ్రహాల వద్ద ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సాంఘిక దురాచారాలు తొలగించేందుకు నిరంతరం పోరాడిన పూలేను భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన తొలి గురువుగా ప్రకటించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు, నాయకులు వెంపా నాగరాజు, బాడీ లైన్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఏర్పాటుచేసిన పూలే వర్ధంతి కార్యక్రమంలో పలువురు నాయకులు మహాత్మా పూలే సేవలను గుర్తుచేశారు. బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీఆర్ విఠల్ కుమార్, రాష్ట్ర కన్వీనర్ పామర్తి యేసు రాజు, నాయకులు దేవరకొండ వెంకటేశ్వర్లు, లక్ష్మీ నారాయణ, మార్గాని శ్రీనివాస్, లక్కోజు రాజగోపాలాచారి, ఉక్కుసూరి గోపాల కృష్ణ, కాగిత అచ్యుత్ పూలే, పిచ్చుక ఆదిశేషు, కొరబండి బాబూరావు, సూర్యం మాస్టారు, హూస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో..

సీనియర్ దళిత నేత నేతల రమేష్ బాబు ఆధ్వర్యంలో పూలే 134వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్ మాట్లాడుతూ పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. అఖిల భారత తపాలా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు దాసరి నాగేంద్ర, రిటైర్డ్ ఆర్‌అండ్‌బీ ఈఈ గరికిముక్కు వెంకటేశ్వరరావు మాట్లాడారు. బందిలి భీమరాజు, భూపతి అప్పారావు, ఎల్ఐసీ రాజు, కొత్తల పూర్ణ, మల్లికార్జున్, బీఎస్పీ నాయకులు కర్రె అంబేడ్కర్, దేవరపల్లి రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పీడీబీటీ జూనియర్ కాలేజీలో..

ఎస్సీ, ఎస్టీ, బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ, డీబీఆర్‌సీ, వైస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో.. పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సూర్యనారాయణ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే అని కొనియాడారు. మూర్తి, ఎస్.జ్యోతి, ఎన్.లక్ష్మీకుమారి, గోసాల ఝాన్సీరాణి, సురేష్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీల మధ్య అంతరాలు తగ్గితేనే మేలైన సమాజం

బీసీల మధ్య అంతరాలు తగ్గినప్పుడే మేలైన సమాజం ఏర్పడేందుకు అవకాశం ఉంటుందని జాతీయ బీసీ నాయకులు పాకా సత్యనారాయణ అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే 134వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక జిల్లా యాదవ సంఘ కార్యాలయంలో ఏపీ బీసీ జేఏసీ ఏలూరు ఆధ్వర్యంలో కుల గణన, బీసీల సమస్యలపై మంగళవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ నేటికీ 95 శాతం బీసీ కులాలు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నాయని చెప్పారు. స్థానిక సంస్థల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లంకా వెంకటేశ్వరరావు మట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు వర్గీకరణ అమలు చేయాలని కోరారు. కులవృత్తులకు పేటెంట్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు కాగిత అచ్యుత్ పూలే, ఉక్కుసూరి గోపాలకృష్ణ, ముదుగురు సూర్యనారాయణ, శంకా బాలయోగి, చిలకలపల్లి కట్లయ్య, షేక్ హుస్సేన్, మార్గాని చంద్రకిరణ్, పోసిబాబు, మల్లిపూడి రాజు, ఇళ్ల శ్రీనివాస్, వీరంకి పండు, మన్నె సుబ్బారావు, మట్టా నాగేంద్ర, పిచ్చుక ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



సంక్షేమ బోర్డు ప్రారంభించిన చంద్రశేఖర్, శ్రీదేవి, సదానందం

ఏలూరు టౌన్: ప్రతి పేదవానికీ సంక్షేమాన్ని అందించేందుకు, పేద కుటుంబాల ఆర్థిక పురోభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఏలూరు క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి అన్నారు. ఏలూరు నగరంలోని 4వ, 5వ డివిజన్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మేలు చేకూరిందని అన్నారు. జగనన్న ప్రతి సామాజికవర్గాన్నీ ఆర్థిక, సామాజిక, రాజకీయంగా పురోభివృద్ధి చెందేలా ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నారని వివరించారు. గతంలో బీసీలను చంద్రబాబు ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేశారని, తూతూమంత్రంగా వారికి పథకాలు అమలు చేసి మోసం చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు పేదలకు కనీసం సెంటు భూమి ఇచ్చారా అని ప్రశ్నించారు. టిడ్కో ఇళ్ల పేరుతో పేదలను దారుణంగా మోసం చేసేందుకు ప్రయత్నం చేయటం దారుణమన్నారు. క్లస్టర్–1 యువజన అధ్యక్షుడు జిజ్జువరపు రమేష్, జేసీఎస్ అధ్యక్షుడు మోటమర్రి సదానందం మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ఆళ్ల నాని హయాంలోనే ఏలూరు నగరం అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించిన ఘనత ఎమ్మెల్యే నానిదే అన్నారు. ఏలూరులో తాగునీటి సమస్య, తమ్మిలేరు వరద ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించారని తెలిపారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు వీర్నపు డింపుల్ రిషీ, గరికపూడి ఇమ్మానుయేల్ జయకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ అభిమానులు ఉన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములవ్వాలి



ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందడమే కాకుండా దానిని వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి కలెక్టర్ బీ లావణ్యవేణి పిలుపునిచ్చారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ కార్యాచరణలో భాగంగా మంగళవారం సీఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లావణ్యవేణి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని వారందరూ ఫారం–6 ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు పవిత్రమైందని ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ఆవశ్యకతను తెలుసుకోనేలా యువతను ప్రభావితం చేయాలని అన్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. కళాశాలల్లో ఓటరు నమోదు కార్యక్రమంపై మరింత అవహన కలిగించేందుకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు. జిల్లా పరిషత్ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు మాట్లాడుతూ డిసెంబరు 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ప్రతి పోలింగ్ స్టేషన్‌లో నిర్వహిస్తారన్నారు. అక్కడ బూత్ లెవల్ అధికారుల వద్ద సంబంధిత దరఖాస్తులు పొంది ఓటరుగా నమోదు, చేర్పులు, మార్పులు చేసుకోవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటే అతిబలమైన ఆయుధమని పేర్కొన్నారు. నగర మున్సిపల్ కమిషనరు సంక్రాంతి వెంకటకృష్ణ తదితరులు మాట్లాడారు. తొలుత సీఆర్ఆర్ కళాశాల నుంచి స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఓటరు నమోదు కోసం దరఖాస్తులను అందుబాటులో ఉంచారు.

నేడు వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో వివిధ మండలాల్లో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాల వివరాలను జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. బుధవారం భీమడోలు మండలం దుద్దేపూడి (ఉదయం), కోడురుపాడు (మధ్యాహ్నం), దెందులూరు మండలం జోగన్నపాలెం (ఉదయం), గాలయగూడెం (మధ్యాహ్నం), ద్వారకాతిరుమల మండలం కొమ్మర (ఉదయం), రాళ్లకుంట (మధ్యాహ్నం), కామవరపుకోట మండలం యడవల్లి (ఉదయం), రావికంపాడు(మధ్యాహ్నం), ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు (ఉదయం), అల్లూరు (మధ్యాహ్నం)లో యాత్ర నిర్వహిస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరించడంతోపాటు, అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రుణాల మంజూరుకు చర్యలు తీసుకొంటారని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిక్షణకు హాజరు కావాలి

ఏలూరు(మెట్రో): జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ సూచనల మేరకు, ఏలూరు రెవెన్యూ డివిజన్‌లోని పంచాయతీ, వార్డు సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎంఎస్ఎంఈ ట్రాకింగ్, సర్వే (మొబైల్ యాప్ ఆధారిత)పై అధికారిక శిక్షణకు హాజరు కావాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు తెలిపారు. ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది హాజరు కావాలని తెలిపారు.

కందిపప్పు సరఫరాను పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలో రేషన్ కార్డు లబ్ధిదారులకు కందిపప్పు, నూనెల పంపిణీని పునరుద్ధరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. బయట మార్కెట్లో కిలో కందిపప్పు రూ.170 నుంచి రూ.200 మధ్య ధర పలుకుతుండటంతో పేదలు కొనుగోలు చేయలేకపోతున్నారని తెలిపింది. వచ్చేది పండుగల సీజన్ కావున పేదలకు రైస్ కార్డుల ద్వారా కందిపప్పు, వంట నూనె అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

ఏలూరులో 'ఉక్కు సత్యాగ్రహం'



మాట్లాడుతున్న ఉక్కు సత్యాగ్రహం సినిమా దర్శక, నిర్మాత సత్యారెడ్డి

ఏలూరు (టూటౌన్) : విశాఖ ఉక్కు తెలుగు వారి హక్కు... దానిని కాపాడుకుందాం అనే ఇతి వృత్తంతో ఉక్కు సత్యాగ్రహం సినిమా రూపొందించినట్టు చిత్ర దర్శకుడు, నిర్మాత సత్యారెడ్డి తెలిపారు. సినిమా యూనిట్ బృంద సభ్యులు మంగళవారం ఏలూరు విచ్చేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకర్ల వద్ద సినిమా విశేషాలను వెల్లడించారు. తాను జనం ఎంటర్ టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మించిన 53వ చిత్రం ఉక్కు సత్యాగ్రహం అని తెలిపారు. వెయ్యి రోజులుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తోన్న ఉద్యమానికి సంఘీభావంగా సామాజిక బాధ్యతగా నిర్మించిన ఈ చిత్రాన్ని వచ్చే నెల 15వ తేదీ నాటికి విడుదల చేయనున్నట్టు చెప్పారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఆఖరి చిత్రం ఇదని, ఇందులో ఆయన పాత్ర అరగంట వరకు ఉందని తెలిపారు. స్టీల్ ప్లాంట్ జేఏసీ చైర్మన్ అయోధ్య రామన్న మాట్లాడుతూ విశాఖ నడిబొడ్డున ఉన్న స్టీల్ ప్లాంట్‌కు చెందిన 20 వేల ఎకరాలను కొట్టేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని, రూ.5 వేల కోట్లు పెట్టుబడి పెట్టిన కేంద్రం ఇప్పటి వరకు స్టీల్ ప్లాంట్ నుంచి రూ.54 వేల కోట్లు డివిడెండ్ తీసుకుందని చెప్పారు. స్టీల్ ప్లాంట్ నుంచి కరోనా సమయంలో దేశవ్యాప్తంగా మెడికల్ ఆక్సిజన్ అందించిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తెలుగు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నిర్మించిన చిత్రాన్ని ప్రతి తెలుగు వారూ ఆదరించాలని కోరారు. సమావేశంలో యూనిట్ సభ్యులు రాహుల్ రంగనాథ్, ప్రశాంత్, వి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న డీఈఓ శ్యామ్ సుందర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఇప్పటికే నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా తరగతి గదులతో పాటు పాఠశాలల్లో వివిధ నిర్మాణాల నిమిత్తం రెండో విడతలో రూ.270 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని డీఈఓ పి.శ్యామ్‌సుందర్ తెలిపారు. ఏలూరు ఇన్నర్‌వీల్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రూ.4 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి గదులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాఠశాలలకు కావాల్సిన వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. మంచి ఫలితాలు సాధించడం ద్వారా పాఠశాలకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు సైతం ప్రభుత్వ విద్యాలయాల అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల్లో నాలుగో తరగతి గదులను డిజిటల్ తరగతి గదులుగా మార్చడానికి ఏలూరు ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఏలూరు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు పీఎస్ లక్ష్మి మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల్లో విద్యార్థినులు సాంకేతిక విద్య అభ్యసించడానికి వీలుగా డిజిటల్ తరగతి గదులను తమ క్లబ్ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పేద మహిళకు డీఈఓ చేతుల మీదుగా కుట్టుమెషీన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జి.అచ్యుత, అంతర్జాతీయ కోశాధికారి సరితా లునాని, ప్రధానోపాధ్యాయురాలు పి.పార్వతీ దేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	22
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	11
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్‌ఈఎల్	22.15	4822	26
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	27

జగనన్న వెంటే అన్ని వర్గాల ప్రజలు

దెందులూరు: సీఎం జగనన్న వెంటే అన్ని వర్గాల ప్రజలున్నారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. మంగళవారం గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ ఆధ్వర్యంలో జగనన్న ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డు వద్ద లబ్ధిని వివరించారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, కొండేటి గంగాధరబాబు, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు తోట పద్మారావు, మొర్ల సుబ్బారావు, తోట వెంకన్న, వార్డు మెంబర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ల నిర్మాణంతో లో ఓల్టేజీ సమస్య పరిష్కారం

ఎంపీ శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు

పెదవేగి: విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణంతో లో ఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని, రైతులకు, ఆక్వా రైతులకు, ప్రజలకు మేలు కలుగుతుందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. మండలంలోని కొప్పాక గ్రామంలో మంగళవారం రూ.139.66 కోట్ల వ్యయంతో 220/132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఏపీ ట్రాన్స్‌కో మంజూరు చేసిన ఈ విద్యుత్ ఉప కేంద్రం శంకుస్థాపన కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్య వేణి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శంకుస్థాపన కార్యక్రమాన్ని సభికులు వీక్షించి, సీఎం సందేశాన్ని ఆలకించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడంలో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. నవరత్న పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయంతో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ బి. లావణ్యవేణి మాట్లాడారు.